మనుషులయ్యా! కొస్త కూడా జాలీ దయ లేవా? చిన్న కాకి పిల్లను అంత నిర్దాక్షిణ్యంగా కొట్టి చంపేస్తారా? మీకు చేతులెలా వచ్చాయి?" అంటూ ఎవరిమీదో కేకలేస్తోంది.

నేను ఆశ్చర్యపోతూ మంచంమీంచి లేచి పెరట్లోకి వెళ్లి అమ్మను విషయం అడిగాను.

మన ఇంటి ప్రహరీగోడ మీద వాలిన కాకిపిల్లను ఎవరో గోడ అవతల్నుండి రాయితో కొట్టారట. ఎగిరే శక్తి ఇంకా పూర్తిగా రాని ఆ కాకిపిల్ల అక్కడికక్కడే చచ్చింది. వారం రోజుల నుండి ఆ కాకిపిల్ల మన పెరట్లోనే ఉంది. తల్లి కాకి ఈ వారం రోజుల్నుండి మన పెరడు వదల కుండా ఆ కాకిపిల్లకు ఏ ప్రమాదం జరక్కుండా కాపు కాసింది. పెరట్లోకి ఎవరైనా వెళ్తే చాలు గోలగోలగా అరుస్తూ ఎగురుకుంటూ వెళ్లి అటువెళ్లిన వాళ్ల నెత్తిన కాళ్లతో తన్నేది. ఈ రెండు రోజుల్నుండి పిల్లకాకికి రెక్కల్లో కొస్త శక్తి వచ్చింది. అటు ఇటూ కొద్దిగా ఎగురుతూ ఈ రోజు ఉదయమే ఆ ప్రహరీ గోడ మీద వాలింది. ఇంతలోనే వాళ్లెవరో కొట్టి చంపేశారు. తల్లికాకి ఇంతవరకూ ఇక్కడే ఉండి ఇప్పుడే ఎటో ఎగిరిపోయింది. వారం రోజుల పాటు ఎంతో శ్రద్ధతో తన పిల్లకు ఏ ప్రమాదం జరక్కుండా కాపు కాసుక్కూర్చున్న ఆ తల్లికాకి మరో రెండు రోజులు జాగ్రత్తపడితే బాగుండేది. పిల్లకాకికి రెక్కలబలం పూర్తిగా వచ్చుంటే, ఆ వెధవలెవరో కొట్టిన దెబ్బకు దొరక్కుండా ఎగిరి వెళ్లిపోయి ఉండేది. దాని ప్రాణం అది రక్షించుకోగలిగేది" అంటూ చెప్పుకొచ్చింది అమ్మ.

నేను ఆలోచనలో పడ్డాను.

కాకిపిల్ల విషయంలో ఏదో సరికొత్త వాస్తవం అవగతం అయినట్లనిపించింది. వెంటనే బంటి గుర్తొచ్చాడు.

వారం రోజులపాటు తల్లికాకి పిల్లకాకి రక్షణ గురించి కాపుకాసినట్లే అమ్మా నాన్నా చిన్నప్పట్నుంచీ బంటీని చాలా గారాబంగా పెంచారు. పిల్లకాకికి కొస్త రెక్కల బలం వచ్చినట్లే బంటీ ఇప్పుడే సంపాదనలో పడ్డాడు. ఇంకా స్థిరత్వం, ఆలోచనలో పరిణతి పెరగాలి. తల్లికాకి మరో రెండు రోజులు జాగ్రత్తపడితే బాగుండునట్లే బంటీ విషయంలో నేనూ, అమ్మా మరికొద్ది రోజులు జాగ్రత్త పడాలి. పిల్లకాకికి రెక్కల బలం పెరిగితే ప్రమాదం నుండి తప్పించుకోగలిగినట్లే. బంటీ ఆలోచనల్లో పరిణతి, సంపాదనలో స్థిరత్వం వస్తే జీవితంలో తన కాళ్ల మీద తాను బతగ్గలడు.

బంటీ పట్ల నా నిర్లక్ష్యం ఎంత తప్పో కాకిపిల్ల గురించి అమ్మ చెప్పిన మాటల్ని బంటి గాడి పరిస్థితితో సరిపోల్చి చూస్తే నాకర్థమైంది.

సినిమా హాల్లో పని చేస్తున్నాడు కదా! కొన్నాళ్లు వాడినలా వదిలేస్తే సరిపోతుంది అన్న నా నిర్లక్ష్యం, అశ్రద్ధ ఆవేశపడి ఇంట్లోంచి అలిగి వెళ్లిపోయిన బంటీని మరింతగా చెడగొడుతుంది. మంచీ చెడూ చెప్పే వాళ్లు లేక వాడు మరింత పతన స్థితికి దిగజారిపోయే అవకాశం ఉంది.

ఆ ఆలోచన కలిగిన వెంటనే నేను హైదరాబాద్ వెళ్లి బంటీని కలిసి రావాలని నిశ్చయించుకున్నాను. అక్కడ్నుంచి వాడిని తీసుకు వచ్చేద్దామని కాదు. వాడి మంచీ చెడ్డా తెలుసుకొని అవసరమైన సహాయ సహకారాలు అందిద్దామని. ఎందుకంటే! గతంలో అమ్మానాన్నలు వాడి పట్ల చూపించిన అతిగారాబం ఎంత తప్పో! ఇప్పుడు వాడి పట్ల నేను చూపిస్తున్న నిర్లక్ష్యం కూడా అంతే తప్పని అవగతం అయింది కాబట్టి.

**-కె.నాగేశ్వరరావు**
**(విజయవాడ)**

# లిఫ్ట్!

'బంద్' కారణంగా నగర వీధులన్నీ బోసిపోతున్నాయి. ట్రాఫిక్ చాలా పల్చగా ఉంది. అడపాదడపా ఒకటీ అరా మోటార్ సైకిళ్లు, ఆటోలు తప్ప రోడ్ల మీద మరెలాంటి అలికిడీ లేదు.

రోడ్డు వారగా నిలబడిన ఓ అమ్మాయి లిఫ్ట్ కావాలన్నట్లుగా చేయెత్తి బొటనవ్రేలు చూపడంతో సర్వేశ్వరరావు మోటార్ బైక్‌కి సడన్ బ్రేక్ వేశాడు.

తీరా చూస్తే ఆమె ఎవరో కాదు. తమ వీధిలో ఉండే లోకేశ్వరరావు చెల్లెలే. సర్వేశ్వరరావుకి లోకేశ్వరరావుతో పెద్దగా పరిచయం లేకున్నా కొంచెం ముఖపరిచయం మాత్రం ఉంది.

చిరునవ్వుతో వచ్చి మోటార్ బైక్ ఎక్కింది అనిల.

అందమైన అలాంటి ఆడపిల్లకి లిఫ్ట్ ఇచ్చే అదృష్టం తనకి దొరికినందుకు సంబరపడిపోయాడు సర్వేశ్వరరావు. అతని మనసులో కించిత్ గర్వం కూడా తొంగిచూసింది.

"ఏమండీ 'బంద్' కదా ఇవ్వాళ ఇంట్లో రెస్ట్ తీసుకోవాల్సింది." మోటార్ బైక్ ముందుకు దూకిస్తూ అన్నాడు సర్వేశ్వరరావు.

"ఇమ్మీడియట్‌గా కొన్ని ఇంపార్టెంట్ ఫైల్స్ పూర్తి చేయాలని బాస్ ఆర్డర్! దాంతో రాక తప్పలేదండి" అంది అనిల.

"ఏం బాసులోనండీ! మన కష్టసుఖాలు పట్టించుకోరు గదా!" సానుభూతిగా అన్నాడు సర్వేశ్వరరావు.

"బస్సులు లేకపోవడంతో ఉదయం రావడం కూడా చాలా ఇబ్బందయిందండి."

"కాదు మరి.." ఒప్పుకుంటున్నట్లన్నాడతను.

"ఆటో అంటే కూడా భయంగా ఉందండి. మీటర్ మీద ఇరవై పాతికా ఇమ్మంటున్నారు."

"అవునవును... ఇలాంటి బంద్ రోజుల్లో అయితే మరింత డిమాండ్ చేస్తారు వాళ్లు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఎలాగైనా ఆ పరిచయాన్ని మరింత పెంచుకొని ఆమెకు చేరువ కావాలని సర్వేశ్వరరావు ఉద్దేశం. అందుకే తనే మళ్లీ, "పోనీ ఈ పూట మీ బ్రదర్ని స్కూటర్ తీసుకు



నైనా రమ్మని చెప్పాల్సింది" అన్నాడు సంభాషణ పొడిగిస్తూ.

"ఆ అది మాత్రం ఏం సుఖంలెండి? పెట్రోలు ధరలు మాత్రం మండిపోవడం లేదూ?' అందామె నిన్నుహగా.

"నిజమే. అలా అని నడిచిపోలేం కదండీ?'

"కనీసం మీ బ్రదరన్నా ఆఫీసు వదిలే సమయానికి వెహికల్ తీసుకొస్తే మీక్కాస్త శ్రమ తప్పేది".

"ఇందులో శ్రమ ఏముందిలెండి?"

"అదేం మాట? అదే నేనైతే మీ అన్నయ్యలా ఉదాసీనంగా వదిలేసి ఊరుకునే వాణ్ణి మాత్రం కాదు" గొప్ప విశాల హృదయుడినని నిరూపించుకోడానికి తెగ తాపత్రయ పడిపోయాడు సర్వేశ్వరరావు.

''వాడు వస్తాననే చెప్పాడండీ. కానీ నేనే వద్దన్నాను.''

''అదేం''

''ఓ ప్రక్క పెట్రోలు దొరక్క చస్తుంటే 'బంద్' నాడు కూడా తిరిగి దాన్ని వేస్ట్ చేయడం తెలివితక్కువ కాదంటారా? చెప్పండి?''

''అవునవును. మీ 'థింకింగ్ ఆఫ్ ఎకానమీ' అమోఘం'' మెచ్చుకోబోయాడు సర్వేశ్వరరావు.

''అందుకే ఎవడో ఒక తలమాసిన వెధవ లిఫ్ట్ ఇవ్వకపోడులే అని వాడికి నచ్చచెప్పి వచ్చేశానండీ''

సర్వేశ్వరరావు బుర్ర తిరిగిపోయింది. రక్కున బండి ఆపేశాడు. అనిల మోటార్ బైక్ దిగి ''నేననుకున్నట్లే అంతలో మీర్రానే వచ్చారు. చాలా థాంక్స్ అండీ ఇదే మా ఇల్లు. రండి మా అన్నయ్యకి పరిచయం చేస్తాను'' అంటూ గేటు తీసింది.

తర్వాత ఆమె వెనక్కి తిరిగి చూసేసరికి అక్కడ సర్వేశ్వరరావుకనిపించలేదు.

**-బద్దిగం పాండురంగారెడ్డి (జగిత్యాల)**